
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 52.168 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 52.168 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 20,100 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.77,140
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.7,007
3శాతం జీఎస్టీతో	రూ.7,217
నవర (8గ్రా)	రూ.57,736

గరిష్టం/కనిష్టం
35.1 /26.6

వాతావరణం

జిల్లాలో అక్కడక్కడా బుధవారం చిన్నపాటి జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 56 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

విజయ డెయిరీ ఎన్నికలు ఏకగ్రీవం

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సమితి లిమిటెడ్ (విజయ డెయిరీ)కి సంబంధించి జరగాల్సిన మూడు డైరెక్టర్ పోస్టుల ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి హరిబాబు మంగళవారం పేర్కొన్నారు. సోమవారం నాలుగు నామినేషన్‌లు రాగా, మంగళవారం వారిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన అన్నం శ్రీహరి (అన్నారెడ్డిపాళెం), కోట చంద్రశేఖర్‌రెడ్డి (నారికేళపల్లి), గంగా శ్రీనివాసులు (వాసిలి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. వీరి పదవీకాలం ఈ నెల 30వ తేదీ నుంచి ఐదు సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ సబ్సిడీతో సోలార్ ప్యానెల్స్

- జిల్లా కలెక్టర్ ఆనంద్



పీఎం సూర్యఘర్ పథక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రభుత్వ సబ్సిడీతో గృహాలకు ఇంటి పైకప్పు మీద సోలార్ ప్యానెల్స్ నెలకొల్పేందుకు పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలి యోజనను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో పథకం అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకుని ప్రభుత్వ రాయితీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ సామర్థ్యం ఒక కిలో వాట్‌కు నెలకు 120 యూనిట్ల చొప్పున వినియోగదారునికి ఏడాదికి రూ.8వేలు, రెండు కిలో వాట్లకు నెలకు 240 యూనిట్ల చొప్పున వినియోగదారులకు ఏడాదికి రూ.20వేలు ఆదా అవుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద 1,232 అప్లికేషన్లు వచ్చినట్లు తెలిపారు. అనంతరం పథకం పాంప్లెట్‌ను కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మలు ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ సోమశేఖర్ రెడ్డి, బాలచంద్ర, శ్రీధర్, నెడ్‌క్యాప్ పీడీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ డాక్టర్ల నిరసన



నిరసన తెలుపుతున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గత వారం రోజులుగా డాక్టర్లు నిరసన చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం పలు పీహెచ్‌సీలకు చెందిన డాక్టర్లు స్థానిక సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల డాక్టర్లు మాట్లాడుతూ తమకు నష్టం కలిగించే జీఓ నంబర్ 85 రద్దు చేయాలని, టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం తదితరులు మంగళవారం చేపట్టారు. ఆండాళ్, లోటస్, మదర్, హర్ష స్కిన్ అండ్ కాస్మొటాలజీ ఆస్పత్రులతో పాటు క్లారిటీ, సాయి బాలాజీ స్కాన్ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులు, వైద్యశాఖకు సమర్పించాల్సిన నివేదికలు, ఫారం – ఎఫ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడారు. లింగనిర్ధారణ చేస్తే పీసీ, పీఎన్డీటీ చట్టం మేరకు కఠిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. గర్భిణులకు నిర్వహించిన స్కానింగ్ పరీక్షల వివరాలను జిల్లా వైద్యశాఖ కార్యాలయంలోని డెమో విభాగంలో ప్రతి నెలా రెండులోపు సమర్పించాలని సూచించారు. క్షయ విభాగ జిల్లా కో ఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.



కళ తప్పిన స్వర్ణాల

గణేశ్ నిమజ్జనం పూర్తయి దాదాపు రెండు వారాలు అవుతోంది. నెల్లూరు స్వర్ణాల చెరువులో ఆ రోజు నిమజ్జనం చేసిన వినాయకుడి విగ్రహాలు ఇప్పటికీ నీటిపై తేలియాడుతూ కనిపిస్తున్నాయి. గణేశ్ విగ్రహాలను మట్టితో చేసినవే వాడాలని పలువురు నిపుణులు మొత్తుకుంటున్నా చాలా మంది పట్టించుకోలేదు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన వాటినే నిమజ్జనం చేయడంతో అవి నీటిలో వెంటనే కరిగిపోకపోగా, కలుషితం చేస్తోంది. దీంతో స్వర్ణాల చెరువు మంగళవారం ఇలా మురికికుంటలా కనిపిస్తోంది.



సుమనోహరం

పూలు సుమధుర పరిమళాలను వెదజల్లడమే కాదు వాటిని సాగు చేసే రైతులకు కూడా సిరులు కురిపిస్తున్నాయి. కోవూరు నియోజకవర్గం పోతిరెడ్డిపాళెం గ్రామంలో కొందరు రైతులు బంతిపూల తోటలు సాగు చేశారు. పూదోటలు బంతిపూలతో వికసించి కనువిందు చేస్తున్నాయి. బంతిపూలను బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ మార్కెట్‌లకు ఇక్కడి రైతులు తరలిస్తున్నారు. తోటలలోని బంతిపూలను సేకరించే పనిలో మంగళవారం నిమగ్నమైన రైతు కూలీలు.



తగ్గేదేలే..

రంగమేదైనా.. బైక్ ఏ మోడలైనా.. మేము రంగంలోకి దిగనంత వరకే అన్నట్లు.. నెల్లూరులో ఇటీవల అమ్మాయిలు బైక్‌లపై రయ్‌రయ్ మంటూ దూసుకెళ్తున్నారు. గతంలో అమ్మాయిలు బైక్ నడపాలంటేనే భయపడేవారు. కానీ నేడు బుల్లెట్ లాంటి హైస్పీడ్ బైకులను సైతం అవలీలగా నడుపుతూ అందరినీ ఆకర్షిస్తున్నారు. నెల్లూరు మినీ బైపాస్ రోడ్‌లో జావా వాహనాన్ని నడుపుతూ వెళ్తున్న అమ్మాయిలు సాక్షి కెమెరాకు చిక్కిన దృశ్యమిది.

– ఫొటోలు, సాక్షి ఫొటోగ్రాఫర్

విదేశీ ఉద్యోగం వదిలేసి... ప్రకృతి సేద్యం



60 సెంట్ల భూమిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు

- అందులోనే 4 వేల మొక్కలు
- ఏడాదికి ఆరుసార్లు పంట దిగుబడి
- తోట వద్దే కేజీ రూ.150కు విక్రయం
- రైతు నల్లూరి ప్రసాద్ సక్సెస్ స్టోరీ



విక్రయానికి ఉంచిన తైవాన్ పింక్ రకం డ్రాగన్ ఫ్రూట్

తమ పిల్లలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని... రూ.లక్షల్లో ప్యాకేజీ ఉండాలని... విదేశంలో ఉద్యోగం చేయాలని.. పాకులాడుతున్న రోజులివి. పిల్లలను కూడా ఆ లక్ష్యంతోనే చదివిస్తున్నారు. చదువులు అయిన తర్వాత వారిని ఏ దేశానికి పంపించాలనే ఆలోచనలోనే తల్లిదండ్రులున్నారు. ఆ విధంగా ఎంబీఏ పూర్తి చేసి విదేశాల్లో ఉన్నత ఉద్యోగం చేస్తూ.. అక్కడ మానసిక ఒత్తిడికి తట్టుకోలేక తిరిగి వచ్చి వ్యవసాయం వైపు మొగ్గారు నల్లూరి ప్రసాద్.

కందుకూరు రూరల్: కందుకూరులోని చుట్టుగుంట గ్రామానికి చెందిన నల్లూరి ప్రసాద్. ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగం నిమిత్తం టాంజానియా దేశానికి వెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. నెలకు రూ.4 లక్షల జీతం తీసుకున్నాడు. ఉదయం 7 గంటలకు వెళ్తే సాయంత్రం 7 గంటల వరకు డ్యూటీ చేయాల్సిన పరిస్థితి. డ్యూటీ నుంచి వచ్చినా ఉద్యోగ వ్యవహారాల్లోనే. రాత్రి వేళల్లో ఒకటే ఆలోచన. మానసికంగా బాగా ఒత్తిడికి గురయ్యే పరిస్థితి నెలకొంది. డ్యూటీ టెన్షన్లు, ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఇక ఈ ఒత్తిళ్లు తట్టుకోలేమని ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామానికి వచ్చాడు. విదేశాల్లో అంతా కల్తీ ఆహారం తినాల్సి వచ్చేది. రసాయనిక మందులు వాడిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. దీంతో ఉన్న పొలంలోనే ప్రకృతి వ్యవసాయం చేయాలనే ఆలోచన వచ్చింది. ఈ క్రమంలో ముందుగా కందుకూరు ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి పరిశీలించి కొంత అవగాహన చేసుకున్నాడు. తన 60 సెంట్లు భూమిలో ఏదో ఒకటి సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు.



డ్రాగన్ ఫ్రూట్ తోట

డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసి...

ఈ ప్రాంతంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు తక్కువగా ఉందని తెలుసుకొని దానిని సాగు చేయాలని మొక్కలు తీసుకొచ్చాడు. తైవాన్ పింక్, అమెరికన్ బ్యూటీ రకాల మొక్కలు ఒక ఎకరానికి 4వేల మొక్కలు నాటుతారు. అయితే ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసేందుకు ప్రసాద్ మాత్రం 60 సెంట్లలోనే 4వేల మొక్కలు నాటాడు. అంతా ప్రకృతి వ్యవసాయంలోనే దుక్కి దున్ని, మొక్కలు నాటడం ప్రారంభించాడు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంలో పూర్తిగా సాగు చేస్తున్నాడు. ఆవు మూత్రం, పేడతో పాటు మట్టి, మజ్జిగ వంటివి ఉపయోగిస్తారు. జీవామృతం, అరటికాయ ద్రావణం, ఎగ్ అమీనో యాసిడ్, ఆకులతో పొటాషియం, పురుగులు, చీమ పీడల నివారణకు అంతా సహజంగా తయారు చేసిన మందులే వాడారు. ప్రకృతి వ్యవసాయ అధికారులతోపాటు కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్‌బాబు సూచనలు సలహాలు తీసుకుంటూ డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నాడు. మొక్కల మొదళ్లకు డ్రిప్ ద్వారా నీటి సరఫరా, వేసవిలో ఆరుతడులుగా రెయిన్ గన్‌లతో మొక్కలను తడుపుతారు. ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీపై ఒక రూమ్‌ను నిర్మించారు.

పోషక విలువలూ ఎక్కువే

ఈ డ్రాగన్ ఫ్రూట్‌లో పోషక విలువలు ఎక్కువగా ఉన్నాయి. చూడడానికి కూడా పింక్, వైట్ కలర్స్‌లో ఉంటున్నాయి. 100 గ్రాములు ఫ్రూట్ గుజ్జులో 60 క్యాలరీల శక్తి ఉంటుంది. 13 శాతం పిండిపదార్థం, 3 గ్రాములు ఫైబర్ ఉంటుంది. కొవ్వు ఉండదు. 1.2 గ్రాముల ప్రోటీన్లు, మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నాయి.

ఒక్క ఏడాదిలో..

గతేడాది ఫిబ్రవరిలో మొక్కలు నాటితే ఈ ఏడాది ఏప్రిల్ నెల కల్లా పూత పూసి కాయలు వచ్చాయి. మే నెల నుంచి కాయలు కటింగ్‌కు వచ్చాయి. ఇలా ఆరు సార్లు కాపు వస్తుంది. అంటే ఏడాదికి ఆరు నెలలు కాపు కాస్తుంది. ఇప్పటి వరకు ఐదు సార్లు కాయలు కటింగ్ చేయగా రెండున్నర టన్నులు దిగుబడి వచ్చింది. తోట వద్దే కేజీ రూ.150 విక్రయిస్తున్నట్లు రైతు తెలిపాడు. దీంతో పాటు బార్డర్ క్రాప్‌గా జామ, కర్జూరం, శ్రీగంధం, కొబ్బరి, మహాగని, సీతాఫలం, రామాఫలం, రేగి, ద్రాక్ష, మునగ, అరటి, చెరకు, వాటర్ ఆపిల్, బ్లాక్ బెర్రీ వంటి మొక్కలు సాగు చేస్తున్నాడు. అదే విధంగా డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు కూడా విక్రయానికి పెంచుతున్నారు. తోటలు సాగు చేసే వారికి, ఇళ్లల్లో పెంచుకునే వారికి అనుకూలమైన ధరలకే విక్రయాలు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



ప్రస్తుతం కెమికల్, రసాయనిక మందులతో వాడిన ఆహారం తీసుకోవడం వల్ల చాలా మంది అనారోగ్యాల బారిన పడుతున్నారు. రోగాలు మనం తీసుకునే ఆహారం వల్లే వస్తున్నాయి. ప్రకృతి వ్యవసాయంలో ఎలాంటి రసాయనిక మందులు వాడం. జీవామృతం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. వ్యవసాయంలో ఎవరూ మనపై పెత్తనం ఉండదు. మనకు మనమే రాజులం. మానసిక ఒత్తిడి ఉండదు. అన్ని రకాల మొక్కలు, ఔషధ మొక్కలు కూడా నాటాను. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి.

– నల్లూరి ప్రసాద్, రైతు

ఐఎంఎల్ డిపో ఎదుట అవుట్ సోర్స్ ఉద్యోగుల ఆందోళన

నెల్లూరు సిటీ: కొత్త మద్యం పాలసీతో రాష్ట్రంలో 15వేల మంది ఉద్యోగ భద్రత కోల్పోతారని, ప్రభుత్వం తమ గురించి కూడా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నరేంద్ర పేర్కొన్నారు. రూరల్ మండలంలో నరసింహకొండ సమీపంలోని ఐఎంఎల్ డిపో ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ అక్టోబర్ నుంచి నూతన మద్యం విధానం అమలు చేస్తున్నారని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైన్ షాప్స్ సేల్స్‌మెన్, సూపర్‌వైజర్‌లు ఉద్యోగాలు కోల్పోతే రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ తమ ఆవేదనను అర్థం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, సభ్యులు సురేష్, వంశీ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ప్రశ్నిస్తే దాడులు చేస్తున్న టీడీపీ వర్గీయులు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు

కందుకూరు రూరల్: మండలంలోని ఓగూరు పంచాయతీలోని ఆదిఆంధ్ర కాలనీలోకి వెళ్లేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాలువపై కల్వర్టును ఏర్పాటు చేశారు. దీనిని ఈ నెల 9వ తేదీన టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వైఎస్సార్ సీపీ వర్గీయులు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. ఈ వివాదం నేపథ్యంలోనే ఈ నెల 15వ తేదీన టీడీపీకి చెందిన రాయపాటి శ్రీనివాసులు, ఆయన అనుచరులు పాలిపోగు వాసు, రాయపాటి పుల్లయ్య, బాణాల సాల్మాన్, పాలిపోగు రాఘవులు, రాయపాటి బాల వెంకటేష్, పాలిపోగు మహేష్‌లు కరేటి చిన కోటేశ్వరరావుపై ఆయన కుమారులైన అభినయ్, అక్షయ్ కుమార్‌లపై దాడికి పాల్పడ్డారు. అభినయ్ ఫోన్ తీసుకెళ్లిన టీడీపీ వర్గీయుల నుంచి ఫోన్ ఇప్పించాలని పోలీసులను వేడుకోగా.. వారం రోజుల తర్వాత ఫోన్ ఇచ్చారు. టీడీపీ వర్గీయులు దాడి వీడియో ఆ సెల్‌ఫోన్‌లో ఉండడంతో ఆ ఫోన్ ఓపెన్ అయితే ఎక్కడ వీడియోలు బయటకు వస్తాయోనని డేటా మొత్తాన్ని డిలీట్ చేసి బాధితులకు అప్పగించారు. అదే విధంగా ఈ నెల 21వ తేదీ పిల్లల గొడవను రాజకీయం చేసి టీడీపీ వర్గీయులు అత్తాకోడళ్లు అయిన కోటా లక్ష్మి, భవితలపై దాడి చేసి గాయపరిచారు. ఈ రెండు కేసులు వైద్యశాల నుంచి పోలీసులకు ఫిర్యాదులు వెళ్లినా కేసులు నమోదు చేయలేదు. రెండు వర్గాల మధ్య రాజకీయంగా కాలనీలో దాడులు జరుగుతుంటే రూరల్ పోలీసులు ఒక్కసారి కూడా కాలనీకి వెళ్లి ఇరువర్గాలతో మాట్లాడిన దాఖలాలు లేవు. దీంతో పోలీసులు టీడీపీకి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అసలే పేద... ఆపై కేన్సర్

- దాతలు ఆదుకుంటే ప్రాణాలు నిలబడే అవకాశం
- ఇప్పటికే వైద్యానికి రూ.6 లక్షల ఖర్చు
- సాయం కోసం ఎదురుచూపులు
- రోజురోజుకు క్షీణిస్తున్న ఆరోగ్యం



భర్త, కుమార్తెతో మాధవి



మాధవి కాలిపై వచ్చిన మచ్చలు

పొదలకూరు: ఉన్నంతలో హాయిగా సాగిపోతున్న వారి కుటుంబంలో కేన్సర్ మహమ్మారి అలజడి రేపింది. రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబంపై పెద్ద ఉపద్రవమే వచ్చి పడింది. ఏడాది నుంచి వివిధ పరీక్షలు, మందుల పేరుతో రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినా ఫలితం కానరాలేదు. ఇటీవల బయాప్సీ ద్వారా చర్మ కేన్సర్ అని తెలియడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా కుప్పకూలింది. రూ.లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకోలేక దాతల కోసం నిస్సహాయంగా ఎదురుచూస్తోంది.

టైలర్ వృత్తే జీవనాధారం

మండలంలోని అయ్యగారిపాళెం గ్రామానికి చెందిన పసుపులేటి శ్రీనివాసులు టైలర్ వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య మాధవి(32), కుమార్తె వెంకట రోషిణి(10) సంతానం. పేద కుటుంబానికి చెందిన శ్రీనివాసులు పేరున్న టైలర్ వద్ద పని చేస్తూ దాని ద్వారా వచ్చే కూలి డబ్బులతో జీవిస్తున్నాడు. గతేడాది సెప్టెంబరులో మాధవికి చర్మంపై మచ్చలు వచ్చాయి. నెల్లూరు డాక్టర్ల వద్దకు వెళ్లి పలుమార్లు పరీక్షలు చేయించి మందులు వాడారు. మచ్చలు వస్తూ పోతూ ఉండడంతో నెల్లూరు వైద్యానికే రూ.2 లక్షల వరకు ఖర్చుచేశారు. ఎలాంటి గుణం కనిపించకపోవడం వల్ల ఇటీవల చెన్నై విజయ మెడికల్ హెల్త్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి బయాప్సీకి చర్మాన్ని పంపారు. నివేదికలో లింపోమా (తెల్ల రక్తకణాల కేన్సర్)గా నిర్ధారించారు. తెల్లరక్త కణాల జన్యుమార్పులు సంభవించి అవి నియంత్రణ లేకుండా విభజించడం వల్ల చర్మ కేన్సర్ వస్తుందని వెల్లడించారు. ఈ పరీక్షలు, తాత్కాలిక వైద్యానికి శ్రీనివాసులు సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇందు కోసం తనకున్న కొద్దిపాటి నిమ్మచెట్లు, గేదెలను కూడా అమ్మాల్సి వచ్చింది. వైద్యం చేయించిన తర్వాత మాధవికి కొద్దిరోజులు నయమైనట్లు కనిపించినా మళ్లీ వ్యాధి తిరగబెట్టి మెడ, చంకలు, గజ్జలు, మోకలి పక్కన కాలిన మచ్చలు ఉన్నట్టుగా వస్తున్నాయి. దీని ప్రభావం వల్ల దురద, ఆకలి లేకపోవడం, జ్వరం, బరువు తగ్గడం వంటి దుష్ప్రభావాలు కలుగుతున్నాయి. ఉన్నదంతా ఊడ్చి పెట్టినా మాధవికి నయం కాకపోవడంతో నిస్సహాయంగా వారి కుటుంబం మిగిలింది. పోషణ కూడా కష్టంగా మారడంతో పొదలకూరులోని మాధవి తల్లిదండ్రుల ఇంట్లో తలదాచుకుంటున్నారు.

దాతలు దయతలిస్తే..

ఆర్థికంగా చితికిపోయిన శ్రీనివాసులు కుటుంబాన్ని దాతలు ముందుకు వచ్చి ఆదుకుంటే మాధవికి వచ్చిన జబ్బు నయం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రూ.లక్షలు వెచ్చించాల్సి రావడంతో వారు వైద్య పరీక్షలు కూడా చేయించుకోని స్థితిలో ఉన్నారు. రెండో పర్యాయం బయాప్సీ రిపోర్టు ఎలా వస్తుందోనని భయపడుతూ బిక్కుబిక్కుమంటున్నారు. తమ కుటుంబాన్ని ఆదుకుంటే తన కుమార్తెకు తల్లిలేని లోటు లేకుండా ఉంటుందని శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతలు స్పందిస్తే 9347142240 ఫోన్‌పేకు నగదు వేయాల్సిందిగా వేడుకుంటున్నారు.

కేన్సర్‌పై అవగాహన అభినందనీయం



ర్యాలీని ప్రారంభిస్తున్న పెంచలయ్య తదితరులు

నెల్లూరు(అర్బన్): కేన్సర్ మహమ్మారిపై ప్రజలను అప్రమత్తం చేస్తూ చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలను డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అభినందించారు. కేన్సర్‌పై అవగాహన ర్యాలీని గాంధీ బొమ్మ నుంచి పురమందిరం వరకు పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ నటరాజ కణ్ణన్, జిల్లా యూత్ కో ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శేషయ్య, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, విశ్రాంత ఏఎస్సై మహబూబ్‌బాషా, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ బదిలీ

నెల్లూరు(సెంట్రల్): జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి జిల్లాలో ఈఈగా ఉన్న అశోక్‌కుమార్‌ను నియమించారు. మరో రెండు రోజుల్లో అశోక్ కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు.

లేఅవుట్లో లోకాయుక్త విజిలెన్స్ అధికారి తనిఖీ




లేఅవుట్, రికార్డులను పరిశీలన చేస్తున్న లోకాయుక్త అధికారి గంగరాజు

ఆత్మకూరు: ఆత్మకూరు–నెల్లూరుపాళెం మధ్య ఏర్పాటు చేసిన స్పార్క్ సిటీ లేఅవుట్లో ఏపీ లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ ఇన్ వెరిఫికేషన్ వి గంగరాజు మంగళవారం తనిఖీ చేశారు. లేఅవుట్ యాజమాన్యం ఇరిగేషన్ కాలువల స్థలాలను, శ్మశాన స్థలాన్ని ఆక్రమించి లేఅవుట్ వేశారని, స్థానికంగా ఉన్న ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దారు సుధీర్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఆర్ఐ ప్రదీప్‌తో కలిసి ఆయన లేఅవుట్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. 2012లో మున్సిపాలిటీ నూతనంగా ఏర్పడిన సమయంలో ఈ లేఅవుట్ ఏర్పాటు చేశారు. 19.70 ఎకరాల్లో సుమారు 240కిపైగా ప్లాట్లు ఏర్పాటు చేసిన ఈ లేఅవుట్లో 5.60 ఎకరాలు మాత్రమే కన్వర్షన్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ లేఅవుట్‌లో సుమారు 87 ప్లాట్లు ఇరిగేషన్ స్థలంతో పాటు శ్మశాన స్థలంలో ఏర్పాటు చేసినట్లు నిర్ధారించారు. ఇలా ఆక్రమించిన భూమి 2.17 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పూర్తిస్థాయిలో అనుమతుల్లేవని మున్సిపల్ అధికారులు తెలిపారు. అనధికారికంగా వేసిన లేఅవుట్‌కు అనుమతులు ఎలా ఇచ్చారని, ఆక్రమిత భూమి గురించి అధికారులు పట్టించుకోని వైనం తదితర అంశాలపై లోకాయుక్త ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు గంగరాజు వివరించారు. లోకాయుక్త అధికారి ప్లాట్లను తనిఖీ చేసేందుకు వచ్చారన్న విషయం తెలుసుకున్న కొనుగోలు దారులు, స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు.



వన్యప్రాణికి ప్రాణహాని



కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో అటవీశాఖ రేంజ్‌ల పరిధిలో సువిశాలమైన అటవీ ప్రాంతం ఉంది. అడవిలో ఉండాల్సిన జంతువులు జనారణ్యంలోకి తరచూ వస్తున్నాయి. అడవిలో వన్యప్రాణికి భద్రత కొరవడింది. భవిష్యత్‌లో సమూలంగా వన్యప్రాణులు అంతరించిపోయే ప్రమాదం కనిపిస్తోంది. ఇటీవల కాలంలో మహా పట్టణంగా విస్తరించిన కావలి పట్టణంలోని జనారణ్యంలోకి చుక్కలు జింకలు వచ్చాయంటే అడవిలో వన్యప్రాణికి భద్రత ఎంత అనేది తేటతెల్లమవుతోంది. అటవీ ప్రాంతంలో వాటికి ఆహారం, నీటి కొరత ఏర్పడడమే కాకుండా వెంటాడుతున్న వేటగాళ్ల చేతుల్లో తప్పించుకుని ఇలా జనారణ్యంలోకి వస్తున్నాయి. వీటి సంరక్షణకు అటవీశాఖ అధికారులు ఎక్కడా క్షేత్రస్థాయిలో పర్యటించి భద్రతా చర్యలు చేపడుతున్న దాఖాలాలు కనిపించడం లేదు.

- కావలిలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ వద్దకు ఇటీవల చుక్కల జింక ఒకటి వచ్చింది. స్థానికులు పట్టుకుని అటవీ శాఖకు అప్పగించారు.
- కావలి వెంగళరావునగర్‌లో నివాసాల వద్దకు ఒక జింక చేరుకుంది. కుక్కలు కరిసిన గాయాలతో ఉన్న ఆ జింకను స్థానికులు దగ్గరకు తీసి ప్రాథమిక వైద్యం చేసి, సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు అందజేశారు.
- కావలి పశ్చిమ శివార్లలో ఉదయగిరి రోడ్డులో అప్పుడే ప్రాణాలు కోల్పోయిన జింకను అటుగా పోతున్న వాహనచోదకులు గమనించారు. అటవీ శాఖకు సమాచారం అందదంతో వారు దానిని ఖననం చేశారు.
- దుత్తలూరు మండలంలో వేటగాడు జింక మాంసం అమ్మకానికి సిద్ధం చేసి ఉంటే అటవీ శాఖ అధికారులు గుర్తించి అరెస్ట్ చేశారు.

- కావలి, ఉదయగిరి పరిధిలో సువిశాలమైన అడవి
- అడవి జంతువులకు కొరవడిన రక్షణ
- మరో వైపు పెరిగిన వేటగాళ్ల సంచారం
- వెంటాడుతున్న ఆహారం, నీళ్లు కొరత
- జనారణ్యంలోకి వస్తున్న వన్యప్రాణులు

కావలి: అడవిలో స్వేచ్ఛగా విహరించాల్సిన జంతువులు జనావాసాల్లోకి వస్తున్నాయంటే అటవీశాఖ అధికారులు అడవి పర్యవేక్షణ కంటే ఆఫీసులకే పరిమితవుతున్నారని స్పష్టమవుతోంది. కావలి రేంజ్ పరిధిలో 55 వేల హెక్టార్లు, ఉదయగిరి రేంజ్ పరిధిలో 43,350 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతంలో చిరుతలు, జింకలు, ఎలుగుబంట్లు, కుందేలు, కణితలు, దుప్పిలు, అడవి పంది, అడవి దున్నలు, నక్కలు, కోతులు ఇలా అనేక రకాలు ఉన్నాయి. ప్రధానంగా మిగిలిన జంతువుల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ జింకలు మాత్రం తరచూ జనావాసాలోకి చేరుకుంటున్నాయి. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు పశువులు మేతకు, వంట కట్టెలు కోసం నిత్యం తిరుగాడుతున్నారు. మరో వైపు వేటగాళ్లు, కుందేళ్లు, జింకలు, అడవి పందుల కోసం రేయింబవళ్లు సంచరిస్తున్నారు. వీరి అలజడితో వన్యప్రాణులు ప్రాణరక్షణ కోసం తప్పించుకుని ఇలా జనారణ్యంలోకి వస్తున్నాయనేది అటవీశాఖ అధికారులే చెబుతున్నారు. ముఖ్యంగా 2019 ఏడాదికి ముందు, గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అటవీ ప్రాంతాల్లో నీటి నిల్వల కొరత ఏర్పడింది. వర్షాభావంతో ఫలాలు ఇచ్చే చెట్లు కూడా మోడు బారడంతో ఆహారం, నీరు కోసం కూడా ఇలాంటి పరిస్థితి అనివార్యమవుతుతోంది.

వేటగాళ్లు.. స్మగ్లర్ల అలజడితో

ప్రధానంగా ఉదయగిరి అటవీ ప్రాంతంలో ఎర్రచందనంతో పాటు మారే, నారేపి, ఎర్రచందనం, చిరుమాను, బిల్లుడు, చింత, అడవి మామిడి, పెద్దమాను, గుంతన, గచ్చకాయి, రావి, మిర, తపస్వి తదితర 70 రకాల చెట్లు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉండే అడవులు కనుమరుగవుతుండగా, అటవీ శాఖ అడవులు నరికి జామాయల్, వెదురు, నేరేడు, ఎర్రచందనం వంటి మొక్కలను నాటడంతో వన్యప్రాణుల నివాసాలు లేకుండా పోయాయి. అటవీ ఫల సంపదతో పాటు వన్యప్రాణుల వేటగాళ్లు, ఎర్రచందనం, కలప స్మగ్లర్ల సంచారంతో వన్యప్రాణులు తల దాచుకొనేందుకు ఇబ్బంది ఏర్పడింది. ఈ అడవిలో నీటి కొరత కారణంగా చిరుతలు, ఇతర జంతువులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రాకపోకలు సాగిస్తున్నాయని, వన్యప్రాణుల దాహం తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలు, కుంటలు, సాసర్ పిట్స్‌లు శిథిలావస్థలో ఉన్నాయి. వీటిలో నీరు నిల్వ ఉండడం లేదు. నీరు లేకపోవడంతో అవి చాలా చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో తాగునీరు లేకపోవడంతో జంతువులు పలుచోట్ల రోడ్లను దాటుతూ ఉన్నాయి. ఇటీవల ఉదయగిరి ఫారెస్ట్ సరిహద్దులో ఉన్న రోడ్డుపై పెద్ద పులి రోడ్డు పైకి వచ్చింది. అధికారుల దృష్టికి రాని ఇలాంటివి కొల్లలుగా ఉన్నాయి.

వాతాంతం.. పండగల్లో వన్యప్రాణుల మాంసం విక్రయాలు

అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండే గ్రామాల్లో ఆదివారాలు, పండగల సమయాల్లో విచ్చలవిడిగా వన్యప్రాణుల మాంసం విక్రయాలు సాగుతున్నాయి. ఇటీవల దుత్తలూరులో జింక మాంసం విక్రయం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. ప్రధానంగా వేటగాళ్లు కుందేళ్లు, అడవి పందులు, జింకలను వేటాడి స్థానికంగా మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. అటవీశాఖాధికారులు ఇలాంటి ప్రత్యేక రోజుల్లో అటువైపు కన్నెత్తి చూస్తే ఇలాంటి దారుణాలు, దాష్టీకాలు బయటపడుతాయి. అటవీశాఖ బీట్ ఆఫీసర్ల నుంచి రేంజ్ ఆఫీసర్ల వరకు కార్యాలయాలకు పరిమితమవుతుంటే ఇలాంటివి ఎలా భయటపడుతాయని ప్రజలు నిలదీస్తున్నారు.

పర్యాటక క్షేత్రాలుగా..

వన్యప్రాణుల రక్షణతో పాటు వాటిని నేరుగా దగ్గర వీక్షించేందుకు అటవీశాఖ అనేక చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. నెల్లూరు 'నగరవనం' అటవీ ప్రాంతాన్ని చూసిన అనుభూతిని కల్పిస్తోంది. ఇక పక్కనే ఉన్న ప్రకాశం జిల్లాలో వన విహార్, టైగర్ ఫారెస్ట్ ఇలా పర్యాటకులు వీక్షించేందుకు అనువుగా ఏర్పాట్లు చేసింది. కానీ కావలి, ఉదయగిరి ప్రాంతంలో అటువంటి అనుభూతిని ఆస్వాదించే అదృష్టం లేకుండా పోయింది. ప్రకృతి ప్రేమికులకు అడవి అందాలు వీక్షించేందుకు చక్కటి అవకాశాన్ని అటవీ అధికారులు కల్పించే చర్యలు తీసుకోవాలి. పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీని రూపొందించి, అడవిలోని కాటేజీల్లో భోజనం, బస ఏర్పాటు, అడవి జంతువులు, అడవులు వాటి ఆవశ్యకతపై లఘు చిత్రాలను చూపించడం, పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల జంతువుల గురించి వివరించడం, వన్యప్రాణులు, అడవుల రక్షణ గురించి అవగాహన కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలి. అడవులు, వన్యప్రాణుల ప్రాధాన్యంపై పర్యాటకులకు అవగాహన పెంచడానికి అడవి సందర్శన కార్యక్రమాన్ని సిద్ధం చేయాల్సి ఉంది. అడవిని మంచి టూరిజం స్పాట్‌గా మార్చేందుకు అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలి.

అడవిలో పహారా కాస్తున్నాం

అడవి సమీపంలో ఉన్న గ్రామాల్లోని ప్రజల్లో అటవీ చట్టాలు, జంతువుల సంరక్షణపై తరచూ అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తుంటాం. జంతువుల సంరక్షణకు నిత్యం అడవిలో పహారా కాస్తుంటాం. వేటగాళ్లను గుర్తించి వారి నుంచి నాటు తుపాకీలు, ఉచ్చులను స్వాధీనం చేసుకుంటున్నాం. పర్యాటక ప్రణాళికలు అయితే ఇంకా ఎటువంటి ఆలోచనలు ప్రస్తుతానికి చేయలేదు.

– టి.ఉమామహేశ్వరరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కావలి, ఉదయగిరి







- ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు
- పది అడుగుల లోతులో గుంతలు
- చోద్యం చూస్తున్న పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు

గ్రావెల్ మాఫియా బరితెగింపు

వెంకటాచలం: మండలంలో అధికార పార్టీ నేతలు బరి తెగించారు. గ్రావెల్ మాఫియా అవతారమెత్తి అడ్డూ అదుపు లేకుండా తవ్వేస్తున్నారు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు తేడాలు లేకుండా పగలు, రాత్రీ విచ్చలవిడిగా అక్రమంగా కొల్లగొడుతున్నారు. కట్టడి చేయాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌లు చోద్యం చూస్తున్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి కనుసన్నల్లోనే జరుగుతుండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాగో వీరిని ఆపలేము.. అక్రమ రవాణా పేరుతో నాలుగు రూపాయలు సంపాదించుకోవచ్చనే ఆలోచనతో వ్యవహరిస్తున్నారు. వీరు సర్వాధికారాలు ఉన్న అధికారులా.. అధికార పార్టీ బానిసలా అని స్థానిక ప్రజలు అసహ్యించుకుంటున్నారు. అధికారులపై ఇంతకంటే దిగుజారుడు విమర్శలు కూడా చేస్తున్నారు.

ఉద్యమంలా.. తవ్వకాలు

వెంకటాచలం, ఎర్రగుంట, చవటపాళెం గ్రామాల్లో రెండు రోజుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో గ్రావెల్ అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. వెంకటాచలంలోని పెద్దగుంట చెరువు, చవటపాళెం, ఎర్రగుంట గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో రేయింబవళ్లు ఉద్యమంలా గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ జేబులు నింపుకుంటున్నారు. నిత్యం తహసీల్దార్ కార్యాలయం మీదుగానే గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు తిరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇంటి పరిసర ప్రాంతాలు లెవలింగ్ పేరుతో తవ్వకాలు చేస్తూ, లేఅవుట్లు, ప్రైవేట్ భూములకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు మట్టిని రూ.1,000 నుంచి రూ.1,500 వంతున అమ్ముకుంటున్నారు. ఏకంగా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల్లో జేసీబీలు పెట్టి పది అడుగుల మేర గోతులు తీసి గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు.



ఎర్రగుంటలో ప్రభుత్వ భూముల్లో యంత్రాలు పెట్టి అక్రమంగా చేస్తున్న గ్రావెల్ తవ్వకాలు

తవ్వకాలపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

మండలంలోని ఎర్రగుంట వద్ద ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలపై స్థానికులు మంగళవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. తమ సొంత భూముల్లో ఇంటి అవసరాల కోసం మట్టి తవ్వకాలు చేస్తే రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారని, ప్రస్తుతం ఎర్రగుంటలో ప్రభుత్వ భూముల్లో విచ్చలవిడిగా గ్రావెల్ అక్రమ రవాణా చేస్తుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని నిలదీశారు. ప్రభుత్వ భూముల్లో నుంచి లేఅవుట్లకు తరలిస్తున్నారని, భవిష్యత్‌లో గ్రామ అవసరాలకు గ్రావెల్ ఉండే పరిస్థితి ఉండదని, వెంటనే అడ్డుకోవాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	132
లేయర్ (లైవ్)	115
బ్రాయిలర్ చికెన్	236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	260
లేయర్ చికెన్	195



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.100
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35



ప్రాణాలు తీస్తున్న 'అక్రమ దందా'

అధికార పార్టీలో కొందరు స్వార్థపరులు సహజవనరులు దోచుకుంటూ సాగిస్తున్న అక్రమ దందాకు ప్రజల నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక, మట్టి, గ్రావెల్, కలప అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేదు. రవాణా చేస్తుంటే.. ఎక్కడ ఏ అధికారికి పట్టుబడి కమీషన్లు ఇవ్వాల్సి వస్తుందనే నెపంతో రద్దీ ప్రదేశాలు, మలుపులు వద్ద సైతం మితిమీరిన వేగంతో వెళ్తూ జనాల ప్రాణాలు బలితీసుకుంటున్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ రవాణా చేసే సమయంలో కనీస నిబంధనలు పాటించడం లేదు. పైన పట్టలు కప్పకపోవడంతో ఆ మట్టి, దుమ్ము ఈ వాహనాల వెనుక వెళ్లే వారి కళ్లల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

- విచ్చలవిడిగా ఇసుక, మట్టి, గ్రావెల్, కలప అక్రమ రవాణా
- పట్టుబడుతామని మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనాలు
- రద్దీ ప్రదేశాలు, మలుపుల వద్ద తగ్గని వేగంతో జనంపై దూసుకెళ్తున్న వైనం
- వాహనాలపై పట్టలు కప్పకుండా తరలింపు
- వెనుక వచ్చే వాహనాచోదకుల కళ్లల్లో దుమ్ము

- వింజమూరు మండలం శంఖవరం వద్ద రెండు నెలల క్రితం కలప అక్రమ రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టంతో గుండెమడుగులకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు విడిచాడు. నిరు పేద కుటుంబానికి ఆధారమైన వ్యక్తి అకాలంగా మరణించడంతో ఆ కుటుంబం పరిస్థితి వర్ణణాతీతంగా ఉంది. రెండేళ్ల బిడ్డ, నిండు గర్భిణి అయిన భార్య, కొడుకు ఆదాయంతో ఆధారపడే తల్లిదండ్రులు, అక్క చెల్లెళ్ల కష్టాలు చూస్తే కరుడుగట్టిన పాషాణ హృదయాలు కూడా ద్రవిస్తాయి. కానీ అక్రమ దందాతో సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న టీడీపీ నేతలకు మాత్రం ఇలాంటివి పట్టవు.
- కలిగిరి మండలం పరికోట సమీపంలో సోమవారం రాత్రి ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు గ్రామ సహాయకుల నిండు ప్రాణాలను గాలిలో కలిసిపోయాయి. ఆ ఇద్దరు సంపాదనపై ఆధార పడిన కుటుంబాలు వీధిన పడ్డాయి. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలే. ప్రతి రోజు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న అక్రమ రవాణా వాహనాల ప్రమాదంలో పలువురు ప్రాణాలు పోతుండగా, మరి కొంత మంది క్షతగాత్రులవుతువున్నారు. పోలీసులు మాత్రం ఘటనలు జరిగినప్పుడు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ప్రకృతి వనరుల అక్రమ రవాణా చేస్తూ మితిమీరిన వేగంతో వెళ్తున్న వాహనాల జోలికి పోవడం విశేషం.



మితిమీరిన వేగంతో వెళ్తున్న అక్రమ ఇసుక ట్రాక్టర్ (ఫైల్)

ఉదయగిరి: కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచి ఆ పార్టీ నేతలు ప్రకృతి వనరులను చెరపట్టారు. గ్రామస్థాయి నేత నుంచి జిల్లా స్థాయి వరకు నేతల వరకు అందిన కాడికి ఇసుక, మట్టి, గ్రావెల్, కలప రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమ రవాణా చేస్తూ అందినకాటికి దోచుకుంటున్నారు. ఈ క్రమంలో వాహనాలు మితి మీరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలకు దారితీస్తూ అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కుటుంబానికి ఆధారమైన పెద్ద దిక్కును కోల్పోయి పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కూటమి నేతల బరితెగింపు వ్యవహారంతో ఆ పార్టీ దిగువ స్థాయి క్యాడర్ రెచ్చిపోతుంది. అధికార ధీమాతో ఎవర్ని లెక్క చేయడం లేదు. అడ్డుకోవాల్సిన అధికారులు, పోలీసులు నిర్లిప్తంగా ఉండడంతో మరింత రెచ్చిపోతున్నారు.

నిత్యం అక్రమ రవాణా

ఉదయగిరి డివిజన్‌లో పలు మండలాల్లో స్థానికంగా ఉన్న వాగులు, వంకలు నుంచి నిత్యం వందల వాహనాల ద్వారా మితిమీరిన వేగంతో రాత్రీ పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఈ క్రమంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ అక్రమ రవాణా వెనుక అధికార పార్టీ నేతలే ఉండడంతో పలు కేసులు రాజీ అవుతున్నాయి. పోలీసులు కూడాఅధికార పార్టీ నేతలు ఒత్తుళ్లకు తలొగ్గి బాధిత కుటుంబాలను నయానో.. భయానో నచ్చ చెప్పి రాజీ చేస్తున్నారు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతూ మరింత బరితెగిస్తున్నారు. వరికుంటపాడు, వింజమూరు, ఉదయగిరి, జలదంకి, కొండాపురం మండలాల్లో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.



పరికోట వద్ద ఘటనా స్థలంలో మృతదేహాలు (ఫైల్)